క్లుప్తంగా

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి



కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ కేఎఫ్.కెనడీ అన్నారు. కాకుమాను అంబేడ్కర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో వసతులతో పాటు ప్రాథమిక స్థాయి నుంచి ప్రతి విద్యార్థి ఇంగ్లీషులో రాణించాలనే లక్ష్యంతో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. ప్రతి రోజు విద్యార్థులకు ఇంగ్లీషులో పాఠ్యాంశాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల పని తీరు, విద్యార్థుల ప్రగతి వివరాలు తెలుసుకుని, మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

చిత్రలేఖనంలో నారాకోడూరు విద్యార్థుల ప్రతిభ



చేబ్రోలు: నారాకోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం ఎం.ఏడుకొండలు మంగళవారం తెలిపారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు ఎం.లిడియా, ఎంఎస్ తులసి, ఎస్కే నజ్మా చిత్రలేఖనం పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాలు పొందారని, వారికి నగదు, ప్రశంసాపత్రాలను జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి, జేసీ రాజకుమారి జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా అందజేసినటుల చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళి



పొన్నూరు: జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సహకారం చేసే దిశగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చారని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మహమూద్, మండలాధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వర రావు, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు సభ్యులు బొద్దులూరి రంగారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిబేట్‌లో విద్యార్థిని ప్రతిభ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని మంగళవారం గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీవాణి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జరిగిన డిబేట్ పోటీలలో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని జి.ధనలక్ష్మి 'సేవ్ గర్ల్' అనే అంశంలో ప్రథమస్థానం సాధించిందని, కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రం, మెమెంటోతో పాటు రూ.5 వేల నగదు బహుమతి అందుకుందని చెప్పారు. విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదు

పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: టీడీపీ నేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య విమర్శించారు. వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణం వద్ద మంగళవారం పార్టీ శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వడ్లమూడిలో టీడీపీ నేతలు నిర్వహించిన సభలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, టీడీపీ నాయకుల విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు, టీడీపీ నేతల తీరు దొంగే... దొంగ దొంగ అన్నట్లు ఉందని దుయ్యబట్టారు. మండలంలో ఏడు వందల ఎకరాల్లో గ్రావెల్ తవ్వేశారన్న బాబు.. అసలు వాస్తవాలను గమనించాలన్నారు. ఏడు వందల్లో 650 ఎకరాలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తవ్వుకున్నారని తెలిపారు. చంద్రబాబు నిర్వహించిన సమావేశానికి రెండు అడుగులు వెనుక గాని, పక్కన ఉన్న రెండు గ్రామాల్లో కాని పరిశీలిస్తే ధూళిపాళ్ల బాగోతం గురించి ప్రతి ఒక్కరూ చెబుతారన్నారు. నీరు–చెట్టు పేరుతో ప్రతి గ్రామంలో తవ్వకాలు చేసింది ధూళిపాళ్ల, అతని సోదరుడు సురేంద్ర అని, క్వారీయింగ్ చేసి మైనింగ్ డాన్‌లుగా పేరు తెచ్చుకున్నట్లు విమర్శించారు. చంద్రబాబు ఎప్పుడూ వాస్తవాలు మాట్లాడే పరిస్థితి లేదన్నారు. ప్రజలను నిలువునా మోసం చేయటం వెన్నతో పెట్టిన విద్య అని కిలారి అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పొన్నూరు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను ధూళిపాళ్ల ఓర్వలేకపోతున్నారని ఆయన మండిపడ్డారు. అబద్ధాలతో పచ్చమీడియా సహకారంతో కాలం గడుపుతున్నారన్నారు. పొత్తులో ఉన్న జనసేన పార్టీ జెండాలను నారాకోడూరు, వడ్లమూడిలో టీడీపీ నాయకులు తొలగించారని, ఆ పార్టీకి చెందిన నాయకుల పేర్లు కూడా సభలో వెల్లడించలేదన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు మరొకసారి బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే కిలారి ఆగ్రహించారు.

సమావేశంలో మైనార్టీ కమీషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, మాజీ జెడ్పీటీసీ కోట శ్రీనివాసరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, ఎస్సీ సెల్ నాయకురాలు కంచర్ల మాణిక్యం, మార్కెట్టు యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పెదకాకాని ఎంపీపీ, జెడ్పీటీసీలు టి.శ్రీనివాసరావు, గోళ్ల జ్యోతి, వైఎస్సార్ సీపీ చేబ్రోలు, పెదకాకాని, పొన్నూరు మండల పార్టీ అధ్యక్షుడు షేక్ పెదమస్తాన్, ఆదిశేషు, మహమూద్, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, బొద్దులూరి రంగారావు, బీమవరపు విజయలక్ష్మి, కాసు ఈశ్వరరెడ్డి, అంకినీడు చౌదరి, షేక్ జానీ, పాలడుగు వెంకటేశ్వర రావు, జి శ్రీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీవీ ప్యాట్‌లో పార్టీ గుర్తు కనిపిస్తుంది

సెక్టోరల్ ఆఫీసర్ లీలారాణి

ప్రత్తిపాడు: ఓటరు తను వినియోగించుకున్న ఓటు ఏ గుర్తుపై పడిందో వీవీ ప్యాట్‌లో తెలుస్తుందని సెక్టోరల్ ఆఫీసర్, ఎంఈవో–2 లీలారాణి అన్నారు. మండల పరిధిలోని తుమ్మలపాలెం, నడింపాలెం సాయిప్రభు కాలనీ, పార్వతీపురం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లు, ప్రధాన కూడళ్ల వద్ద ఈవీఎంలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానం, ఓటు వేసిన తరువాత అనుమానాలు వ్యక్తమైతే తెలుసుకునే పద్ధతి, బ్యాలెట్ పేపర్, ఓటు గుర్తింపు కార్డు.. ఇలా అనేక రకాల అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సెక్టోరల్ ఆఫీసర్ లీలారాణి మాట్లాడుతూ ప్రతి పౌరుడు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు వేసిన తరువాత ఓటు ఏ గుర్తుపై పడిందో తెలుసుకునేందుకు కూడా అవకాశం ఉందని, ఓటు వేసిన పార్టీ గుర్తు వీవీ ప్యాట్‌లో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. అంతేకాకుండా ప్రిసైడింగ్ ఆఫీసర్లు ఎన్ని బ్యాలెట్ పేపర్లు వినియోగిస్తే, అన్ని స్లిప్‌లు వీవీ ప్యాట్‌లో కచ్చితంగా ఉంటాయని లీలారాణి వివరించారు. ఈవీఎంల పనితీరుపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని స్పష్టం చేశారు. వెంట ఏఎస్ఐ బి.శ్రీనివాసరావు, బీఎల్‌వోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నడింపాలెం సాయిప్రభు కాలనీలో అవగాహన కల్పిస్తున్న సెక్టోరల్ ఆఫీసర్ లీలారాణి, ఏఎస్ఐ

ఘనంగా 'బలసాని' జన్మదిన వేడుకలు

ప్రత్తిపాడు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న మైదానంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్‌ను కోయవారిపాలెం నుంచి ద్విచక్ర వాహనాలు, కార్లతో భారీ ర్యాలీగా గ్రామంలోకి తీసుకొచ్చారు. ప్రత్తిపాడు మెయిన్ రోడ్డులో ప్రచార రథంపై పార్టీ జెండా ఊపుతూ, ప్రజలకు అభివాదం చేస్తూ బలసాని ముందుకు సాగారు. అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రావ్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వేదికపై జన్మదిన కేక్‌ను కట్ చేసి, నాయకులకు తినిపించారు. క్రేన్ ద్వారా భారీ గజమాలను బలసానికి వేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భారీగా అన్నదానం చేశారు. తనపై ప్రేమాభిమానాలు చాటిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని బలసాని అన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

పెదనందిపాడు: ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ జన్మదినం సందర్భంగా మంగళవారం పేదలకు మండల కన్వీనర్ షేక్ ఖాశింపీరా దుస్తులు పంపిణీ చేశారు. పెదనందిపాడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కిరణ్‌కుమార్ బర్త్‌డే కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఖాశింపీరా మాట్లాడుతూ కిరణ్ కుమార్ మరెన్నో బర్త్‌డేలు జరుపుకోవాలని, ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధిచేయాలని కోరారు. ఎంపీపీ టి.హెప్సిబా, వైస్ ఎంపీపీ కమ్మ సాంబశివరావు, జంగా సుందర్, సర్పంచ్‌లు దాసరి పద్మారావు, సాతులూరి సురేష్, ఎన్ నరసింహారావు, వైస్ సర్పంచ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వేడుకలు

గుంటూరు రూరల్: ఏటుకూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలివచ్చి బలసానికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలను అందించి, గజమాలలు వేసి తమ అభిమానాన్ని తెలియజేశారు. పత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసేందుకు శక్తి వంచనలేకుండా కృషిచేస్తామని నినాదాలు చేశారు. భారీ బాణ సంచా పేల్చి సంబరాలు చేశారు. అనంతరం సర్వమత ప్రార్థనలు చేసి సర్వమత గురువుల ఆశీర్వాదాలను బలసాని పొందారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



బలసానిని భారీ గజమాలతో స్వాగతిస్తున్న ప్రజలు



పార్టీ జెండాలతో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ



దుస్తులు పంపిణీ చేస్తున్న కన్వీనర్ షేక్ ఖాశీం పీరా



సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్‌ను గజమాలలతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రోడ్డు, సైడు కాలువ నిర్మాణ పనులు ప్రారంభం

పాండ్రపాడు(కాకుమాను): గ్రామంలో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని సర్పంచ్ దేవిరెడ్డి సాంబయ్య అన్నారు. పాండ్రపాడులో పంచాయతీ నిధులతో 180 మీటర్ల పంచాయతీ రోడ్డు, 180 మీటర్ల సైడు కాలువల నిర్మాణ పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



ఐటీ అవగాహన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: సైబర్ నేరాలు, డిజిటల్ టెక్నాలజీ మోసాలపై విద్యార్థులు, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. ఉమా శంకర్‌రెడ్డి హెచ్చరించారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువయ్యాయన్నారు. అమాయకులను డిజిటల్ టెక్నాలజీతో నేరగాళ్లు మోసం చేయటం జరుగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఈ విషయాలు గమనించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఆన్‌లైన్ గేమ్స్‌లో, యాడ్స్ పేరిట జరిగే మోసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, డాక్టర్ సిరాజుద్దీన్, డాక్టర్ పీఎల్ మాధవరావు తదితరులున్నారు.

'బజరంగ్' ఆధ్వర్యంలో గుండె వైద్య పరీక్షలు

చేబ్రోలు: బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బజరంగ్ 'సంక్షేమ సంగమం' కార్యక్రమాన్ని నారాకోడూరు గ్రామంలో జనవరి 11న నిర్వహించారు. 'మీ గుండె పదిలం' శిబిరంలో యాంజియోగ్రామ్ అవసరమైన 32 మందిలో రెండవ విడతగా ఐదుగురిని ప్రత్యేక వాహనంలో విజయవాడ మెడ్ స్టార్ ఆసుపత్రికి తీసుకెళ్లి.. వైద్యసేవలు అందజేశారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ స్పందిస్తూ.. జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా "మీ గుండె పదిలం" నినాదంతో చేపట్టిన వైద్య శిబిరాలు ఎంత ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. గుండె సమస్య ఉన్న వారు అది తీవ్రతరం కాకముందే వైద్య శిబిరం ద్వారా వైద్య సహాయం పొందడం అభినందనీయమన్నారు.

అంబటి మురళీకృష్ణ పరామర్శ..

ఇటీవల నారాకోడూరు, శలపాడు గ్రామాల్లో 'మీ గుండె పదిలం' కార్యక్రమం ద్వారా గుండె సర్జరీ చేయించుకున్న వారిని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ మంగళవారం పరామర్శించారు. శలపాడుకు చెందిన పరిశా పూర్ణచంద్రరావు, నారాకోడూరుకు చెందిన వెలగా సత్యనారాయణ, దానబోయిన శివయ్యను అంబటి వ్యక్తిగతంగా పరామర్శించి, ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో బజరంగ్ 'సంక్షేమ సంగమం'లో భాగంగా కళ్లజోళ్లు తీసుకున్న అనేక మంది అంబటి మురళీకృష్ణను అభినందించారు.



శలపాడులో పరిశా పూర్ణచంద్రరావును పరామర్శిస్తున్న అంబటి మురళీకృష్ణ

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు



బీపీ చెక్ చేయించుకుంటున్న వృద్ధులు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక సచివాలయం పక్కనున్న కల్యాణ మండపంలో జరిగిన శిబిరానికి 252 మంది రోగులు హాజరయ్యారు. వీరికి వైద్యాధికారులు డాక్టర్ కె.స్రవంతి, పి.వాసవి, కె.మాధురి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ గ్రామాల్లోనే వైద్య సేవలు ప్రజలకు అందాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం జేఏస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం శ్రీనగర్ కాలనీలో చోరీ ఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు మంగళవారం తెలిపిన వివరాల మేరకు శ్రీనగర్ కాలనీలో నివాసముంటున్న కామేశ్వరశర్మ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లారు. గమనించిన దొంగలు మంగళవారం తెల్లవారు జామున కామేశ్వరశర్మ నివాసం తలుపులు పగలగొట్టి బీరువాలో దాచిన రూ.60 వేల విలువైన బంగారు వస్తువులు, వెండి వస్తువులను దోచుకుని పారిపోయారు. మంగళవారం సాయంత్రం కామేశ్వర శర్మ తిరిగి ఇంటికి రాగా తలుపుల తాళాలు పగలకొట్టి ఉండడంతో చోరీ జరిగిందని గమనించి రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెత్త సేకరణ నూరు శాతం చేయాలి



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ కీర్తి

నెహ్రూనగర్: నగరంలో ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి హెచ్చరించారు. నందివెలుగు రోడ్డు ఎల్బీ నగర్, బాలాజీ నగర్, పాత గుంటూరు, బస్టాండ్ రోడ్, నందివెలుగు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మధ్యాహ్నం ప్రాధాన్య క్రమంలో గ్యాంగ్ వర్క్ జరగాలని, కార్మికులు, కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు హాజరు నివేదిక ప్రతి రోజు ఇవ్వాలని ఎంహెచ్‌ఓని ఆదేశించారు. సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు కొందరు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, క్షేత్రస్థాయి పర్యటనలో కార్యదర్శులు అనధికారికంగా విధులకు గైర్హాజరైనట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నందివెలుగు రోడ్ మున్సిపల్ స్కూల్ ఎదురు చెత్త కుప్పలు ఉండడంపై సంబంధిత కార్యదర్శి జి.దాసుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో సదరు ప్రాంతంలో వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఎల్బీనగర్ కల్వర్టు వద్ద అవుట్ ఫాల్ డ్రైన్ వ్యర్థాలతో బ్లాక్ అయి ఉండడంపై సంబంధిత శానిటేషన్ కార్యదర్శి డి.జ్ఞాన రత్నం, ఇన్‌స్పెక్టర్ ఎం.ఐజాక్‌లకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఎంహెచ్‌ఓని ఆదేశించారు. శానిటరీ సూపర్‌వైజర్లు పారిశుద్ధ్య పర్యవేక్షణలో మరింత పిన్ పాయింట్‌గా పరిశీలించాలని కోరారు. ఈ–ఆటోల ద్వారా సేకరించిన వ్యర్థాలను జీటీఎస్(గార్బేజ్ ట్రాన్స్‌ఫార్మర్ స్టేషన్)లకు తరలించేప్పుడు సమయపాలన ఉండాలని పేర్కొన్నారు. జీటీఎస్ దగ్గర ఆటోల ట్రిప్పులు నమోదు చేయాలని చెప్పారు. త్వరగా అన్ లోడ్ అయ్యేలా అదనపు సిబ్బంది, కాంపాక్టర్‌లను అందుబాటులో ఉంచాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. పర్యటనలో ఎంహెచ్‌ఓ(ఎఫ్ఏసీ) మధుసూదన్, శానిటరీ సూపర్‌వైజర్ ఆయుబ్ ఖాన్ పాల్గొన్నారు.

కీళ్లు కీలకమే..



- చిన్న వయసులోనే నొప్పుల సమస్య
- ముందస్తు జాగ్రత్తలతో చెక్ పెట్టవచ్చు

గుంటూరు మెడికల్: కీళ్ల నొప్పులు సాధారణంగా వయసు పైబడిన వారిలో ఎక్కువగా ఉంటాయి. పంట పొలాల్లో కష్టపడి పనిచేసుకుంటూ వ్యాధులపై ఏ మాత్రం అవగాహన లేని పల్లెటూరిలో ఉండే వారు ఎక్కువగా నొప్పుల గురించి వైద్యుల వద్ద ప్రస్తావిస్తుంటారు. కాని నేడు ఆధునిక జీవనశైలి మారటంతో పల్లె, పట్నం తేడా లేకుండా ప్రతిచోటా కీళ్ల నొప్పుల బాధితులు కనిపిస్తున్నారు. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా 40 ఏళ్లకే కీళ్ల నొప్పుల బారిన పడుతున్నారు. అవగాహనతో కొద్దిపాటు జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా నొప్పుల బాధల నుంచి బయటపడొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

బాధితులు అధికమే...

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రతి ఆరుగురిలో ఒకరు కీళ్ల నొప్పులతో బాధపడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. తాగునీటిలో ఫ్లోరైడ్ అధికంగా ఉండటం వలన పల్నాడు జిల్లా ప్రజలు ఎక్కువగా ఆర్థ్రైటిస్ బారిన పడుతున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ఆర్థోపెడిక్ వైద్య విభాగానికి ప్రతిరోజూ వివిధ సమస్యలతో 300 మంది వస్తున్నారు. వీరిలో సుమారు 160 మంది వరకు ఆర్థ్రైటిస్ వ్యాధి బాధితులే. ఆడవాళ్లకు 40ఏళ్లలోపే కీళ్ల నొప్పులు వస్తుండగా మగవారికి 60 ఏళ్లకు వస్తున్నాయి. మహిళలు 60శాతం మంది, పురుషులు 40శాతం మంది కీళ్ల వ్యాధితో బాధపడుతున్నారు. అటువంటి కీళ్ల బాధల నుంచి విముక్తుల్ని చేసి వృద్ధాప్యంలో మెరుగైన జీవన ప్రమాణాలు అందించేందుకు ఆధునిక వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి.

వీరిలో అరుగుదల....

కీళ్ల అరుగుదల అనేది శరీరంలో ఏ భాగంపైనైనా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ అరుగుదల కారణంగా ప్రధానంగా మోకీలు, తొంటి, నడుము, మెడ దెబ్బతింటాయి. నొప్పుల బాధపడేవారి సంఖ్య రాను రానూ పెరుగుతూ వస్తుంది. గతంలో 60 ఏళ్ల పైబడిన వారు వ్యాధి బారిన పడేవారు. ప్రస్తుతం 40 ఏళ్లకే వ్యాధి బారిన పడుతున్నారు. పొగ తాగేవారిలో, స్థూలకాయం ఉన్నవారిలో, 55 సంవత్సరాలు పైబడిన వారిలోనూ, గతంలో కీళ్లకు దగ్గరగా ఫ్రాక్చర్ అయిన వారిలో, కీళ్ల వాతంతో బాధపడేవారిలో, కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్స్ వల్ల, మహిళల్లో రుతు క్రమం ఆగిపోయినవారిలో కీళ్ల అరుగుదల ఉంటుంది.

కొద్ది మందికే ఆపరేషన్ అవసరం...



మోకీలు నొప్పులు అధికంగా ఉంటే తప్పనిసరిగా వైద్యుల పర్యవేక్షణలో అవసరమైన మేరకే మందులు వాడాలి. నొప్పుల నివారణ కోసం తక్రమం తప్పకుండా వ్యాయామం చేయటం, ఆహారపు అలవాట్లు, జీవన విధానాన్ని మార్చుకోవటం ద్వారా చాలా వరకు వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు. వ్యాధి బాధితుల కోసం స్టెమ్‌సెల్స్ థెరపీ, ప్లేట్‌లెట్‌రిచ్‌ప్లాస్మా, మొజైక్ ప్లాస్టీ లాంటి ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. పూర్తిగా అరిగి దినచర్య కష్టతరమై, వంకరపోయిన వారికి మాత్రమే శస్త్రచికిత్స అవసరం. కీళ్ళ నొప్పులతో బాధపడే ప్రతి వంద మందిలో కేవలం ఐదు నుంచి పది శాతం మందికి మాత్రమే ఆపరేషన్ అవసరమవుతుంది.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, గుంటూరు